# తల్లిమనసు

పనిమనిషి పాపకు నీళ్ళు పోస్తున్నది. స్వాతి పనిమనిషికి కావలసినవి అందించి బెడ్ రూంలోకి వెళ్ళింది.

ఇంట్లో ఉయ్యాల లేదు. పాపకు మంచం మీదే పడుకోవడం అలవాటు చేసింది స్వాతి. పాపకు మూడో నెల. స్వాతి పరుపు శుభ్రంగా దులిపి ఇస్త్రీ దుప్పటి వేసింది. పాప పరుపు పాడు చెయ్యకుండా దాని మీద రబ్బరు గుడ్డ వేసింది. రబ్బరు గుడ్డ మీద తను పాపకోసం ప్రత్యేకంగా కుట్టిన చిన్న బొంత వేసింది. తన పాత చీరను నాలుగు మడతలు వేసి బొంత మీద వేసింది.

పనిమనిషి పాపకు వళ్ళు, తల శుభ్రంగా తుడిచి సాంబ్రాణి పొగ వేసి స్వాతి చేతికిచ్చింది. స్వాతి పాపకు పౌడరు పూసి తెల్ల చొక్కా తొడిగింది. కళ్ళకు కాటుక పెట్టింది. నుదుట బొట్టు, బుగ్గన చుక్క పెట్టి మంచం మీద పడుకోబెట్టింది. పాప పడిపోకుండా అటూ ఇటూ దిండ్లు అడ్డం పెట్టింది.

పాప కళ్ళు మూసుకుని నిద్రపోతున్నది. నీళ్ళు పోస్తున్నంతసేపూ కొంపలంటుకుపోతున్నట్టు ఏడుస్తూనే ఉంటుంది. నీళ్ళు పోసుకున్నాక ఆ ఏడుపంతా ఏమైపోతుందో సుఖంగా నిద్ర పోతుంది. స్వాతి నవ్వుతున్నది.

దబ్బపండులాంటి మేని రంగు, వొత్తయిన నల్లటి జుట్టు....అందమైన రబ్బరు బొమ్మలా మెరిసిపోతోంది పాప. రెండు పిడికిళ్ళు గట్టిగా మూసుకుని నిద్రపోతున్నది. స్వాతి పాప బుగ్గ చిదిమి ముద్దుపెట్టుకున్నది. పాప ఉలిక్కిపడి కదిలింది. పిడికిళ్ళు తెరిచింది. పాప అరచేతులు, అరికాళ్ళు గులాబీ రంగులో ముట్టుకుంటే కంది పోయేలా ఉన్నాయి.

స్వాతి పాపకు పల్చటి దుప్పటి కప్పి తక్కువ స్పీడ్‌లో ఫేన్ పెట్టింది. పక్కనే మరో మంచం మీద ప్రవీణ్ పడుకుని గాఢంగా నిద్రపోతున్నాడు.

వెధవకి చదువంటే అసలు శ్రద్ధ లేదు.... ఆదివారం వచ్చిందంటే పక్కమీదినుంచి అసలు లేవడు....

"ఎంతసేపు నిద్రపోతావురా? టైం ఎంతైందో తెలుసా?"

స్వాతి ప్రవీణ్‌ను గట్టిగా కుదిపింది. ప్రవీణ్ కళ్ళు విప్పి చూసి మళ్ళీ మూసేసుకున్నాడు.

"ఇవ్వాళ ఆదివారమేగా మమ్మీ? కాస్సేపు పడుకోనియ్!"

"చూడు! ఎంత ఎండెక్కిపోయిందో? ఇంకా పడుకుంటే అంతా నవ్వుతారురా!!"

ప్రవీణ్ లేవనని గునిసినా స్వాతి వినకుండా వాడిని బలవంతంగా లేపి కూర్చోబెట్టింది. వాడి చేతిలో బ్రష్, టూత్ పేస్టు పెట్టి వాడిని బాత్ రూంలోకి తరిమింది. వాడు పళ్ళు తోముకునే సరికి వేన్నీళ్ళు తోడింది.

"పొయ్యి మీద ఇడ్లీలు ఉడుకుతున్నాయి. వేడి వేడి ఇడ్లీలు తిందుగాని...త్వరగా నీళ్ళు పోసుకునిరా!" అంటూ స్వాతి వంటింట్లోకి నడిచింది.

ప్రవీణ్, తను టిఫిను తిన్నాక స్వాతి వంటిల్లు చక్కబెట్టుకుంటున్నది.

'ఉష్'!....'ఉష్'!

ప్రవీణ్ గట్టిగా విజిల్ ఊదుతున్నాడు. చెవులు చిల్లులు పడిపోతున్నాయి. స్వాతి పరిగెత్తుకుంటూ హాల్లోకి వెళ్ళింది.

"నీకు పుణ్యం ఉంటుంది ఊరుకోరా! చెల్లి లేస్తుంది!" అంటూ విసురుగా ప్రవీణ్ నోట్లోని విజిల్ లాగేసుకుంది.

ప్రవీణ్ నేలమీద పడిపోయి కాళ్ళూ చేతులూ టపాటపా కొట్టుకుంటూ బిగ్గరగా ఏడ్వడం మొదలుపెట్టాడు.

మమకారం, ప్రేమానురాగాలనేవి తర్కానికి అతీతంగా కనిపిస్తాయి. అందులోనూ ఓ తల్లి—తన చిన్నారి పాప విషయంలో అందోళనకు గురైతే, ఇక ఆమె మస్తిష్కం స్తంభించినట్లవుతుంది. ఆమె మనసు తల్లడిల్లిపోతుంది. ప్రతి తల్లీ ఏదో ఒక సమయంలో ఇటువంటి విచిత్రమైన స్థితికి లోనయ్యే వుంటుంది!

వీడివ్వాళ పాపాయిని పడుకోనిచ్చేలా లేడు. స్వాతి ప్రవీణ్‌కు విజిల్ ఇచ్చేసి వాడిని బుజ్జగించింది.

"ఇంట్లో ఊదకురా...మా బుజ్జివి కదూ! చెల్లి లేస్తే నన్ను పని చేసుకోనివ్వదు...కాస్సేపు పడుకోనివ్వదు."

ప్రవీణ్ సరేనని తలాడించి కాస్సేపు విజిల్ ఊదడం మానేశాడు. తర్వాత మరి ఉండబట్టలేక ఇల్లంతా తిరుగుతూ సరదాగా విజిల్ ఊదుతున్నాడు.

"నువ్వు మాటలతో వినేలా లేవురా!"

స్వాతి చెయ్యెత్తేసరికి ప్రవీణ్ తుర్రుమని బైటికి పారిపోయాడు.

'అమ్మయ్య! తుఫాను వెలిసినట్టు ఉంది' అనుకుని తేలికగా ఊపిరి పీల్చుకుంది స్వాతి. ఐదేళ్ళ వెధవను తను కంట్రోలు చేయలేక పోతున్నది. 'అది' కూడా వీడిలాగే తయారయ్యేలా ఉంది. 'అది' పగలంతా హాయిగా



నిద్రపోతుంది. రాత్రిళ్ళు తన ప్రాణాలు తోడేస్తుంది. అన్నకు అన్నే, చెల్లెలుకు చెల్లెలే....ఇద్దరూ తనను వేపుకు తింటున్నారు.

– మందరపు లలిత




వీడు తననే కాదు ఆయన్ని కూడా చెవులు పట్టుకుని ఆడించేస్తున్నాడు. వాడి ఫ్రెండెవరో విజిల్ కొనుక్కున్నాట్ట. అక్కడినుంచి విజిల్ కొనిపెట్టమని ఒకటే పేచీ! నిన్న క్యాంపు వెళ్లే ముందు ఆయన వాడిని బజారుకు తీసుకెళ్ళి విజిల్ కొనిచ్చారు. ఆ క్షణం నుంచి వాడు దాన్ని పట్టుకుని వదలడం లేదు. దాన్ని రేకుతో చేశారు. చూడ్డానికి అందంగా లేకపోయినా ఊదితే మాత్రం కయ్‌మంటూ గూబలదిరేంత శబ్దం వస్తున్నది.

పాప ఏడుపు వినిపించి స్వాతి కంగారుగా పాప గదిలోకి పరిగెత్తింది.

"నా చిట్టితల్లిని ఎవరేవన్నారమ్మా?" అంటూ పాపతో ఊసులాడుతూ పాపను జోకొట్టింది స్వాతి. ఎంతసేపు జోకొట్టినా పాప ఏడుపు ఆపలేదు. స్వాతి పాపను చేతిలోకి తీసుకొని వళ్లో పడుకోబెట్టుకుంది. పాప ఏడుపు మానేసి మళ్ళీ నిద్రలోకి జారుకుంది. పాప నిద్రపోయాక స్వాతి పాపను పక్కమీద పడుకోబెట్టింది. స్వాతి అవతలకు వెళ్ళిందో, లేదో పాప మళ్ళీ ఏడుపు మొదలు పెట్టింది.

స్వాతి పాపను ఎత్తుకుంది. పాప మంత్రించినట్టు తక్కున ఏడుపు మానేసింది.

'ఇది' బాగా ఎత్తు మరిగింది. మంచం మీద పడుకోబెడితే చాలు పెంకులెగర గొట్టేస్తున్నది. దీన్ని ఎత్తుకుంటూ కూర్చుంటే వంట ఎవరు చేస్తారు? ఆయనైనా ఉంటే కాస్సేపు ఆడించే వారు...అదేం ఉద్యోగమో! ఎప్పుడూ క్యాంపుల్లోనే ఉంటారు. నెలకు ఓ పదిరోజులు ఇంట్లో ఉంటే మహా ఎక్కువ. స్వాతికి భర్త విష్ణువర్ధన్ మీద కోపంగాను, చిరాగ్గాను ఉంది.

తను పదిమంది మధ్య ఉండి వచ్చిందేమో ఒక్కర్తే ఉండాలంటే ఏం తోచదు. భయంగా కూడా ఉంటుంది. నిజం చెప్పాలంటే తను వట్టి పిరికిది. పట్టపగలు కూడా తనకు ఎవరో ఒకరు తోడు ఉండాలి. తాము నలుగురు అక్కాచెల్లెళ్ళు, ఇద్దరు అన్నదమ్ములు, తల్లి, తండ్రి, నాయనమ్మ, తాతయ్య, వచ్చేపోయే చుట్టాలు.... ఇల్లు ఎప్పుడూ పెళ్ళివారిల్లులా కళకళలాడుతూ ఉండేది.

దెయ్యాల కథలంటే తనకు భలే ఇష్టం. తాతయ్యనడిగి మరీ మరీ చెప్పించుకునేది. ఆ కథలన్నీ విని జడుసుకునేది. పట్టపగలైనా సరే ఈ గదిలో నుంచి ఆ గదిలోకి వెళ్ళడానికి కూడా తనకు ఎవరో ఒకరు తోడు రావాలి. రాత్రిళ్ళు పరేసరి చిన్న చెల్లెలిని దగ్గర పడుకోబెట్టుకుని ముసుగు తన్ని పడుకునేది.

ఇప్పటికీ తనకు దెయ్యాలంటే భయమే. దెయ్యాలు లేవని మనస్సుకు ఎంతో నచ్చజెప్పుకున్నా అవంటే భయం మాత్రం పోవడం లేదు. చిన్నప్పుడు తనకు ఒక్క దెయ్యం భయం మాత్రమే ఉండేది. ఇప్పుడు దొంగల భయం కూడా పట్టుకున్నది. పేపరు తెరిస్తే చాలు ఫలానా కాలనీలో దొంగలు పడ్డారు, ఇంత దోచుకున్నారు అంత దోచుకున్నారు అన్న వార్తలే.

తను ఎంత పిరికిదైనా పెళ్ళయ్యాక ఒంటరిగా ఉండటం తప్పలేదు. తన భయాలు పోగొట్టాలని కావాలనే పెద్దవాళ్ళు ఈ పెళ్ళి చేశారేమో! ఇప్పుడు పిల్లలైనా ఉన్నారు కాని పెళ్ళయిన కొత్తలో ఆయన, తనే. ఆయన కూడా ఎప్పుడూ క్యాంపుల్లోనే ఉండేవారు. కొత్తల్లో తనకు భయంగా ఉండి పనిమనిషిని బ్రతిమాలుకుని దాని కూతురిని ఇంట్లో పడుకోబెట్టుకునేది. ఒకరోజు, రెండు రోజులైతే ఎవరైనా సాయం చేస్తారు. ఎల్లకాలం ఎవరు పడుకుంటారు? ఇప్పుడు ఒంటరిగా పడుకోవడం తనకు అలవాటైపోయింది.

కాళ్ళు తిమ్మిరెక్కినట్లున్నాయి. స్వాతి లేచి పాపను పక్కమీద పడుకోబెట్టింది.

ప్రవీణ్ సుడిగాలిలా దూసుకొచ్చాడు.

"మమ్మీ....మమ్మీ! నా విజిలేదీ? గోపీ చూస్తాట!"

"నువ్వెక్కడ పారేసుకున్నావో నాకేం తెలుసురా? ఇందాకల్లా ఊదుతూనే ఉన్నావుగా? ఎక్కడ పారేశావో వెళ్ళి వెతుక్కో....నా ప్రాణాలు తియ్యకు..."

"ప్లీజ్! వెతికిపెట్టమ్మా! కాస్సేపయ్యాక వస్తాను" అంటూ ప్రవీణ్ తుర్రుమన్నాడు.

పాప మళ్ళీ ఏడుపు మొదలెట్టింది. ఎత్తుకున్నంతసేపూ ఊరుకుంటున్నది. పక్క మీద పడుకోబెట్టగానే మళ్ళీ మొదలు! పక్క మీద చీమలేమైనా ఉన్నాయేమోనని స్వాతి పరీక్షగా చూసింది. ఒక్క చీమ కూడా కనబడలేదు. ఇందాకేగా తను పక్క శుభ్రంగా దులిపి వేసింది? ఫేన్ గాలికి ఈగలు, దోమలు కూడా అటు రావడం లేదు. మరి పాప ఇలా 'పోరు' పెడుతున్నదేమిటి? స్వాతికి ఏం తోచడం లేదు. పాపకు దిష్టి కాని తగిలిందేమో?

స్వాతి ఇంత ఉప్పు తీసుకుని పాప చుట్టూ తిప్పి దిష్టి తీసి అవతల పారేసింది. అయినా పాప ఏడుపు తగ్గలేదు.

స్వాతి పాపను భుజంమీద వేసుకుని అటూ ఇటూ తిప్పింది....పాప విడువకుండా ఏడుస్తూనే ఉంది....

తన పిచ్చిగాని దిష్టి 'తగలడం' ఏమిటి? దాన్ని 'తీసెయ్యడం' ఏవిటి? పాపకు కడుపు నొప్పేదు తున్నదేమో? సమయానికి ఆయన కూడా ఊళ్ళో లేరు. నిన్ననే క్యాంపుకెళ్ళారు. నాలుగైదు రోజులైతేకాని రారు. పాపను డాక్టరుకు చూపిస్తే మంచిదేమో? తనకు తెలిసిన డాక్టరుగారి క్లినిక్ సాయంకాలం కాని తెరవరు. సాయంకాలం వరకు ఆగితే ఏం ప్రమాదమో? డాక్టరు తెలిసేదేమిటి? ఫీజు ఇస్తే ఏ డాక్టరు అయినా చూస్తారు.

ప్రవీణ్ వచ్చాడు. "వెతికావా?"

"చెల్లికి వంట్లో బావుండలేదు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తున్నాను. నువ్వు గోపీ వాళ్ళింట్లో వుంటావా? నాతో వస్తావా?"

"వస్తాను...."

స్వాతి ఇంటికి తాళంవేసి పిల్లలిద్దరినీ తీసుకుని 'డాక్టర్' అన్న బోర్డు ఎక్కడన్నా కనిపిస్తుందేమోనని వెతుక్కుంటూ మెల్లిగా నడుస్తున్నది.

'డాక్టర్ ఫణీంద్ర, చిల్డ్రెన్ స్పెషలిస్టు' అన్న బోర్డు చూడగానే స్వాతికి ప్రాణం లేచివచ్చినట్టయింది. స్వాతి లోపలికి వెళ్ళింది. లోపల చాలా మంది ఉన్నారు. స్వాతి వంతు వచ్చేసరికి గంట పైనే పట్టింది.

పాప ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లినట్లు పడుకుండిపోయింది. డాక్టర్ పాప పొట్టమీద చెయ్యివేసి నొక్కి చూశాడు.

"షీ ఈజ్ ఆల్‌రైట్....కంగారుపడకండి!" అని చెప్పి పాతిక రూపాయలు ఫీజు తీసుకుని మందులు రాసిచ్చాడు. పక్కనే వున్న మెడికల్ షాపు కెళ్ళి మందులు కొన్నది స్వాతి. మందులు ముప్పయి రూపాయలుపైనే అయ్యాయి. ఎంతో కొంత! పాపకన్నా ఎక్కువా? స్వాతికిప్పుడు స్థిమితంగా ఉన్నది.

"నా విజిల్ పోయిందిగా? కొత్తది కొనిపెట్టు మమ్మీ! డాడీ కొన్న షాపు దగ్గిరే ఉంది మమ్మీ!" అంటూ మారాం చేశాడు ప్రవీణ్.

"విజిలూ లేదు, ఏంలేదు. ఇంటికి పద!" స్వాతి గట్టిగా గసిరింది. ప్రవీణ్ రోడ్డుమీదే ఏడుపు మొదలుపెట్టాడు. ఇంటికెళ్ళాక గచ్చుమీద దొర్లుతూ పెద్ద గొంతుకతో ఏడ్వడం ప్రారంభించాడు.

"నోరు మూస్తావా, లేదా?" గుడ్లురిమింది స్వాతి. ప్రవీణ్ గొంతు పెద్దది చేశాడు. యుగళ గీతంలా పాప కూడా వాడితో గొంతు కలిపింది.

"దీన్ని సముదాయించలేక ఛస్తుంటే మధ్యలో నీ ఏడుపేమిట్రా?" అంటూ స్వాతి ప్రవీణ్ వీపు మీద ఒక్కటి వేసింది. ప్రవీణ్ ఏడుపు తారస్థాయినందుకున్నది.

పిల్లల ఏడుపు ఎలా మానిపించాలో స్వాతికి అర్థం కావడంలేదు. పాపకు మందుపోసి పక్క మీద పడుకోబెట్టింది. పాప ఏడుస్తున్నా ఎత్తుకునే ఓపిక లేక అలా మంచంమీదే ఉంచేసింది.

"చెల్లికి వంట్లో బాగోలేదు నాన్నా! దానికి కాస్త తగ్గనియ్; నీకు మాంచి విజిల్ కొనిపెడతాగా?" అంటూ స్వాతి ప్రవీణ్‌ను బుజ్జగించింది.

ప్రవీణ్ చటుక్కున లేచి కూర్చున్నాడు. "నిజంగా కొనిపెడతావా?"

"నిజంగా కొంటానురా!"

ప్రవీణ్ ఏడుపు మానేశాడు. కాని పాప మానలేదు.

డాక్టరిచ్చిన మందులు పని చేసినట్టులేవు. అయినా మందు ఇలా గొంతుదిగగానే జబ్బు తగ్గిపోతుందా? మందు పనిచేయడానికైనా కొంత వ్యవధి కావాలి అని స్వాతి మనస్సు సరిపెట్టుకోవడానికి ప్రయత్నించింది.

స్వాతికి చాలా అధైర్యంగా వున్నది. పాప తనకు దక్కుతుందా? పాపలేకుండా తను బ్రతకగలదా?

"భగవంతుడా! ఈ గండం గడిచి పాప కులాసాగా వుంటే నీ కొండకు తీసుకొస్తాను,"

అంటూ స్వాతి ఏడుకొండలవాడికి మొక్కుకుంది.

## చిట్కాలు

★ హెల్మెట్ ఉపయోగించే స్త్రీలు హెల్మెట్ వాడి తీసేటప్పుడు అందులో ఉన్న చమటను ఒక పొడి గుడ్డతో తుడిచి, గాలి తగిలే స్థలంలో నిలువుగా పెట్టాలి. తర్వాత చల్లని నీటిలో ఒక టవల్‌ని తడిపి తలమీదున్న చెమటను తుడవాలి. ఈ విధంగా చెయ్యకపోతే జుట్టు తొందరగా రాలిపోయే ప్రమాదం వుంది.

★ మజ్జిగ మిరపకాయలు తయారు చేసేముందు, మిరపకాయలను మజ్జిగలో వేసేముందు, మెంతులు, ఉప్పు ఈ రెండిటినీ చేర్చి నూరి మజ్జిగలో కలిపి, అందులో పచ్చిమిరపకాయలు వేస్తే అవి రుచికరంగా వుంటాయి.

★ కొంతమందికి అప్పుడప్పుడు పళ్ళల్లోంచి రక్తం వస్తుంది. అప్పుడు ఆవాలు, జీలకర్ర, ఉప్పు పొడిచేసి రోజూ ఈ పొడితో పళ్ళు తోముతూవుంటే రక్తం కట్టడం ఆగిపోతుంది.

—సత్యప్రియ

పాప ఏడుస్తుంటే ఏం చేయలేక స్వాతి పాప మంచం పక్కనే కూలబడి వెక్కి వెక్కి ఏడ్చింది.

టక్....టక్!

వీధి తలుపు ఎవరో కొడుతున్నారు.

స్వాతి చీర కొంగుతో ముఖం తుడుచుకొని వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా ధరిత్రి!

"నువ్వా ధరిత్రీ! రా! రా!"

స్వాతికి ధరిత్రిని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లనిపించింది. ధరిత్రి, స్వాతి చిన్నతనంలో కలిసి చదువుకున్నారు.

ధరిత్రి డాక్టరు. పైగా చిల్డ్రెన్ స్పెషలిస్టు. తనకింక బెంగలేదు. తన బాధ చూడలేక దేవుడే ధరిత్రిని తన ఇంటికి పంపించాడేమో అనుకుంది స్వాతి.

"ఏవిటలా ఉన్నావ్? ఒంట్లో బావుండలేదా?"

"నాకు బాగానే ఉంది. పాపకే ఏమైందో తెలీదు...పొద్దుటి నుంచి ఒకటే ఏడుపు. డాక్టరు దగ్గిరికి కూడా తీసుకెళ్ళి చూపించాను. ఆయన రాసిచ్చిన మందులు వేసాను. అయినా పాప ఆపకుండా ఏడుస్తూనే ఉంది...ఎత్తుకుంటే కాస్త ఊరుకుంటున్నది. పక్కమీద పడుకోబెడితే మరీ ఏడుస్తున్నది!"

స్వాతి ధరిత్రిని లోపలికి తీసుకెళ్ళింది. ధరిత్రి పాపను పరీక్షించింది. పాప ఆరోగ్యంగానే ఉంది.

"పాప పక్క శుభ్రంగా దులిపావా?"

"పాపను పడుకోబెట్టే ముందు పక్క శుభ్రంగా దులిపే వేశాను."

ధరిత్రి పాపను స్వాతి చేతికిచ్చి పక్కమీద వేసిన పాత చీరను లాగి గట్టిగా దులిపింది.

చీర మడతల్లో నుంచి 'టక్'మని ఏదో వస్తువు క్రిందపడింది.

"నా విజిల్!" అంటూ ప్రవీణ్ గబాలున పరిగెత్తుకుని వెళ్ళి దానిని తీసుకున్నాడు.

స్వాతి తెల్లబోయింది.

"వీడు దీన్ని పాప మంచం మీద పడేశాడా? పాప ఏడుస్తూ ఉంటే దానికి జబ్బు చేసిందేమో అని కంగారుపడ్డాను తప్ప దానికేదో గుచ్చుకుని ఏడుస్తున్నదని నాకు తట్టనేలేదు. పక్క శుభ్రంగా దులిపే వేశానుకదా అనుకున్నాను...మళ్ళీ దులిపితే నష్టం ఏవిటి?...నాకు తోచనేలేదు..."

ధరిత్రి పాప చొక్కా విప్పింది. పాప వీపు మీద విజిల్ నొక్కుకున్న గుర్తు స్పష్టంగా కనబడుతున్నది. అక్కడ ఎర్రగా కందిపోయింది. ధరిత్రి పాపకు ఆయింట్‌మెంటు రాసి పడుకోబెట్టింది. పాప హాయిగా నిద్రపోయింది. స్వాతి తేలికగా ఊపిరి పీల్చుకున్నది. ఇంతసేపూ తన మనస్సు ఎంత తల్లడిల్లిపోయింది.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది. స్వాతి ఉలిక్కిపడింది.

"అప్పుడె పన్నెండైపోయిందా? ఇంతవరకు వంటాలేదు, ఏం లేదు. పాప ఏడుస్తుంటే నాకేం తోచలేదు ధరిత్రీ! పాపను చూస్తూ ఉండు... చిటికెలో వంట చేసి వడ్డించేస్తాను" అంటూ స్వాతి వంటింట్లోకి దారి తీసింది.

"నేనూ సాయం చేస్తాను పద! పాపకేం భయం లేదు..."

ధరిత్రి స్వాతి వెనకాలే లోపలికి వెళ్ళింది. □